

యాదాద్రిలో ఆర్జిత సేవలు

యాదాద్రిలో పవిత్రోత్సవాల సందర్భంగా రద్దు చేసిన ఆర్జిత సేవలు శనివారం పునఃప్రారంభమయ్యాయి. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 590 అడుగులు
ఇన్‌ఫ్లో	: 69,884 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 69,884 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,191 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,375 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 7,518 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.38 అడుగులు
ఇన్‌ఫ్లో	: 768 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 623.43 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 258.88 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 305.95 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ఆరోగ్య మిత్రల సమ్మెబాట



సమ్మె నోటీసు ఇస్తున్న ఆరోగ్య మిత్రలు

నల్లగొండ టౌన్ : న్యాయమైన హక్కుల సాధన కోసం సమ్మెలోకి వెళ్తామని ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తికి సమ్మె నోటీసు అందజేశారు. సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జీఓ 60 ప్రకారం వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20లోగా సమస్యలను పరిష్కరించకుంటే పూర్తిస్థాయిలో సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు భూపాల్, అధ్యక్షుడు ఫసియుద్దీన్, ప్రధాన కార్యదర్శి యాదానాయక్, కోశాధికారి ఎ.కవిత పాల్గొన్నారు.

ఆలయాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న అన్నెపర్తి సులోచన

రామగిరి (నల్లగొండ) : దేవాదాయ శాఖ ఆధీనంలోని ఆలయాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన అన్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ, జనగామ జిల్లాల ఆలయాల ఈఓలు, మేనేజర్లతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, భద్రత కోసం సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు. ఆలయ భూముల కోర్టు కేసులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓలు, మేనేజర్లు, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి



ఎన్నికైన మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

చిట్యాల: నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్స్ (రా రైస్) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా దుబ్బాక వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని చిట్యాలలో శనివారం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గుజ్జుల జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొండూరి శేఖర్, ప్రధానకార్యదర్శిగా మిర్యాల వెంకన్న, కోశాధికారిగా సోమారపు శ్రీనివాస్, కార్యదర్శి చీదెళ్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా పీక నర్సింహ, ఆలంపల్లి ఆనంద్‌కుమార్, కుంభం ఉపేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. సమావేశంలో రాచకొండ కృష్ణయ్య, శేపూరి రవీందర్ పాల్గొన్నారు.

క్రీమీలేయర్‌తో సమన్యాయం

పెన్‌పహాడ్ : ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానం అమలు చేయడం ద్వారా దళితుల్లోని పేదలందరికీ సమన్యాయం జరుగుతుందని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు 40 రోజుల పాటు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్‌ను శనివారం పెన్‌పహాడ్‌లో ఆవిష్కరించి మాట్లాడారు.



నల్లగొండ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

నల్లగొండ టౌన్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డాక్టర్లు డిమాండ్ చేశారు. శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెడికల్ స్టూడెంట్స్ నెట్‌వర్క్, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నల్లగొండ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ మహిళలకు రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రులు, మెడికల్ కళాశాల్లో సెక్యూరిటీని పెంచాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలను రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు పుల్లారావు, దైవాదీనం, వెంకట్‌రెడ్డి, పద్మ, శ్రీకాంత్‌వర్మ, రమేష్, నగేష్, విజయ్, అనిల్, విజయ్‌కుమార్‌రెడ్డి, లీలావతి, విశ్వజ్యోతి, నరేస్, హర్షిత, శ్రీజ, నరేష్, గగన్, మెడికల్ కళాశాల విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

• 'రాఖీ'లా ఒదిగి..



చండూరులోని గాంధీజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చొని ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. - చండూరు

చేపల పెంపకానికి చెరువుల వేలం

- చేపపిల్లల పోసేందుకు లీజుకివ్వనున్న మత్స్యశాఖ
- ఎక్కువ ధరకు పాడిన వారికే కేటాయింపు
- లీజు డబ్బులు పంచాయతీ అకౌంట్లలో జమచేయనున్న అధికారులు

నల్లగొండ టూటౌన్ : జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో గల చెరువులు, కుంటల్లో చేప పిల్లలు పోసుకునేందుకు మత్స్యశాఖ అధికారులు వేలం ద్వారా లీజుకు ఇవ్వనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న చెరువులు, కుంటలకు వేలం వేలం పెట్టిన తరువాతనే వాటిల్లో చేప పిల్లలను వదలాలి. వంద ఎకరాలు, అంత కన్నా ఎక్కువ భూమి ఉన్న చెరువులు మత్స్యశాఖ పరిధిలో ఉంటాయి. వంద ఎకరాల కన్నా తక్కువ ఉన్న చెరువులు, కుంటలు గ్రామ పంచాయతీల ఆధీనంలో ఉంటాయి. ఈ చెరువులు, కుంటల్లో చేప పిల్లలు పోసుకునేందుకు మత్స్యశాఖ అధికారులు గ్రామ పంచాయతీల వద్ద వేలం వేసి ఎక్కువ ధరకు పాడిన వారికి కేటాయిస్తారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ చెరువులు, కుంటలు కలిపి 750కి పైగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో చేప పిల్లలు పోసిన తర్వాత సదరు వ్యక్తి



చెల్లించే డబ్బులను మత్స్యశాఖ అధికారులు గ్రామ పంచాయతీల ఖాతాలకు పంపిస్తారు. ఇప్పటి వరకు వేలం ప్రక్రియ ఎక్కడా చేపట్టలేదు. చెరువులు, కుంటలు నిండగానే వివరాలు తెప్పించుకొని వేలం ప్రక్రియకు సంబంధించిన చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నిండుతున్న చెరువులు..

ప్రస్తుతం నాగార్జునసాగర్ ఎడమకాల్వ, వరద కాల్వ, ఏఎమ్మార్పీకి నీటిని విడుదల చేశారు. దాంతో ఆయా కాల్వల పరిధిలో ఉన్న చెరువుల్లోకి నీరు చేరుతోంది. త్వరలోనే వాటి పరిధిలోని చెరువులు, కుంటలు కూడా నిండే అవకాశం ఉంది. మూసీ పరిధిలో కూడా చెరువులు, కుంటల్లోకి నీరు వస్తోంది. దేవరకొండ, మునుగోడు ప్రాంతాల్లో మాత్రం చెరువులు, కుంటలు వర్షాలతోనే నిండాల్సి ఉండగా ఉంది. గతేడాది సాగర్ ప్రాజెక్టులో నీరు లేకపోవడం, జిల్లాలో వర్షాలు కురవకపోవడంతో ఎక్కడ కూడా చెరువులు, కుంటల్లోకి నీరు రాని విషయం తెలిసిందే.

ఆయకట్టులో హెక్టార్‌కు రూ.400

మత్స్యశాఖ నిబంధనల ప్రకారం వేలం ధర ఆయకట్టు ప్రాంతంలోని చెరువులు, కుంటలకు హెక్టార్‌కు రూ.400, నాన్ ఆయకట్టు ప్రాంతంలో హెక్టార్‌కు రూ.200 ధర నిర్ణయించారు. అక్కడి చెరువు ఎన్ని హెక్టార్లు ఉంటే అంత ధర నిర్ణయించి.. అంత కన్నా ఎక్కువకు వేలం పాడిన వారికి లీజుకు ఇవ్వనున్నారు. నీరున్న ప్రతి చెరువు, కుంటను వేలంలో దక్కించుకున్న వారు తప్పనిసరిగా డబ్బులు చెల్లించాల్సిందే. ఈ నిబంధన ఖచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత మత్స్యశాఖ అధికారులపైనే ఉంటుంది. కాగా డిపార్ట్‌మెంట్ చెరువుల లీజును సంబంధిత మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల బాధ్యులు మత్స్యశాఖకు చెల్లించాల్సి ఉంటుంది.

బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లను నియమించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల నియామకాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ సందర్భంగా ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బీఎల్‌ఓ, ఏఈఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఫారం -7 ద్వారా చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా చిరునామా మారిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం, ఫారం -7 జనరేట్ చేయడం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అవగాహన కల్పించాలన్నారు. ఒక కుటుంబం మొత్తం ఒకే పోలింగ్ కేంద్రంలోకి వచ్చేలా, ఒక కాలనీ మొత్తం ఒకే పోలింగ్ కేందం పరిధిలోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, ఆర్డీఓలు రవి, శ్రీనివాసరావు, శ్రీరాములు, ఎన్నికల డీటీ విజయ్ పాల్గొన్నారు.

ఎడమకాల్వ, ఏఎమ్మార్పీ కింద నీరిస్తాం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ, ఏఎమ్మార్పీ కింద సాగునీరు అందిస్తామని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిగా నిండినందున రైతులెవరు కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. క్రమ పద్ధతిలో సాగునీరు ఇచ్చేందుకు రైతులంతా సహకరించాలని కోరారు. ఏకేబీఆర్ వద్ద ఒక పంపు మరమ్మతులో ఉన్న కారణంగా ప్రస్తుతం తక్కువ మొత్తంలో నీరు వస్తోందని.. ఈ నెలాఖరునాటికి పంపు మరమ్మతు పూర్తవుతుందన్నారు. నీటి విడుదల విషయమై అవసరమైతే తక్షణమే ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆయన నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్‌ను ఆదేశించారు. అందరికీ నీరందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు టీ.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, ఏఎస్పీ రాములునాయక్, ఎన్ఎస్పీ సీఈ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చికెన్ ధరపై 'శ్రావణం' ఎఫెక్ట్

- కిలో రూ.158కి పడిపోయిన రేటు
- శ్రావణమాసంలో తగ్గిన వినియోగం

నల్లగొండ టౌన్ : రెండు నెలలుగా కొండెక్కిన చికెన్ ధర కాస్తా తగ్గుముఖం పట్టింది. గత నెలలో కిలో చికెన్ రూ.280 వరకు పలికింది. సామాన్యులు చికెన్ రేటు చూసి తినలేక దూరంగా ఉన్నారు. శుభ కార్యాలు, ఇతర ఫంక్షన్లు, అత్యవసరం అయితే తప్ప చికెన్ తీసుకోలేదు. ఇలా 45 రోజులపాటు చికెన్ రేటు చుక్కలు చూపించింది. కానీ, ఈ నెల మొదటి వారం నుంచి చికెన్ ధరలు రోజురోజుకు తగ్గుతున్నాయి. ఈ నెల 5న కిలో రూ.180 ఉన్న చికెన్ ధర, 11వ తేదీ ఆదివారం నాటికి రూ.150కి పడిపోయింది. 17వ తేదీ శనివారం రూ.158గా ఉంది. ప్రస్తుతం శ్రావణమాసం కావడం ముఖ్యంగా ఈ మాసంలో పూజలు, వ్రతాలు ఇతర కార్యక్రమాలకు ఎక్కువగా ఉంటాయి. మహిళలు మాంసాహారాన్ని ఇంట్లోకి తేనివ్వరు. దీంతో చికెన్ వినియోగం తగ్గి ధరలు కూడా తగ్గాయి. మరోవైపు రేటు తగ్గడంతో కొందరు మాంసం ప్రియులు సంతోషంగా చికెన్ తీసుకుంటున్నారు.



రేటు మళ్లీ పెరుగుతుంది



ప్రస్తుతం శ్రావణమాసం కావడం, ఇతర పూజలు ఉన్నందున చికెన్ ధర రూ.150కి తగ్గింది. గత నెలలో రూ.280 వరకు ఉంది. ఈ నెలలో వివాహాలు, శుభకార్యాలు ఉన్నందున చికెన్ ధర పెరిగే అవకాశం ఉంది.

– శ్రీశైలం, చికెన్ సెంటర్ యజమాని

ఎన్నికల హామీలు అమలుచేయాలి

- కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు

నల్లగొండటౌన్ : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని.. ఆమేరకు ప్రాజెక్టులను పూర్తి



మాట్లాడుతున్న సాంబశివరావు

చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, బొడ్డుపల్లి వెంకటరమణ, నెల్లికంటి సత్యం, కలకొండ కాంతయ్య, ఉజ్జిని రత్నాకర్, మల్లేపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- నలగొండలో అగ్రి షో ప్రారంభం

నల్లగొండ అగ్రికల్చర్ : రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో రైతుబడి ఆధ్వర్యంలో నిర్వహించిన 'వ్యవసాయ ప్రదర్శన' (అగ్రి షో)ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు సాగు పెట్టుబడులు తగ్గించి దిగుబడి పెంచుకున్నప్పుడే వ్యవసాయం లాభసాటి అవుతుందన్నారు. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 1,72,785 మంది రైతులకు రూ.1433 కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. జిల్లాలో ఫ్లోరైడ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎల్‌బీసీ, ఏఎమ్మార్పీని తెచ్చామన్నారు. ఆయిల్‌పాం తోటలను సాగు చేస్తే రైతులకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర ఆదాయం వస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చిన నూతన మార్పులు, సాంకేతికతను చూసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కూడా వ్యవసాయ రంగానికి వస్తున్నారని చెప్పారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాల్లో ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. ఇటీవల బ్రాహ్మణవెల్లెంల



అగ్రిషోలో స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యేలు



డ్రోన్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

ట్రయల్ రన్ ప్రారంభించామని, ఏఎమ్మార్పీ కాలువల లైనింగ్, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పూర్తి చేసామని తెలిపారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రతినెల మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని చెప్పారు. ఎంపీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన కోసం వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో సాగు ఖర్చులు తగ్గి దిగుబడి పెంచే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబడి యూట్యూబ్ ఛానల్ అధినేత రాజేందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రమేష్, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.వెల్లెం ద్వారా సాగునీరు అందిస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి : బ్రహ్మణవెల్లెం – ఉదయ సముద్రం ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తున్న ఆయన నార్కట్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణా జలాలతో నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. బ్రహ్మణవెల్లెం ప్రాజెక్ట్ ద్వారా నకిరేకల్ నియోజకవర్గంలోని 60వేల ఎకరాలకు సాగునీరు అందించే కార్యక్రమాన్ని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. 16 మెగావాట్ల సామర్థ్యంతో ఉండే రెండు పంప్‌మోటర్ల ట్రయల్‌రన్ విజయవంతం చేసి రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేసేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలో నల్లగొండలో నిర్మించిన మెడికల్ కాలేజీని కూడా సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, దైద రవీందర్, బత్తుల ఊషయ్య, దూదిమెట్ల సత్తయ్య, జెర్రిపోతుల భరత్, ప్రజ్ఞాపురం సత్తి, మాదుగుల నాగేశ్వర్‌రావు, వేముల సత్యం ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రుణమాఫీపై సొసైటీ చైర్మన్లు, ఉద్యోగులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు డీసీసీబీకి రుణమాఫీ కింద రూ.279.76 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి సహకార బ్యాంకులో అధికారులు, ప్రజాప్రతినిధులు రుణమాఫీ కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా రైతులు అధికారులను



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివారెడ్డి

కలిసి తమ బ్యాంకు ఖాతా నంబర్లను, ఆధార్ కార్డు సరి చూసుకుని రుణమాఫీ పొందాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు మరో ఐదు కొత్త సహకార బ్యాంక్ బ్రాంచిలు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు అధికారులు పాల్గొన్నారు.

'రైతులను కాంగ్రెస్ మోసం చేసింది'

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి విమర్శించారు. శనివారం నల్లగొండ మండలం మేళ్ల దుప్పలపల్లి, అనంతారం, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ప్రకాశం బజారులోని యూనియన్ బ్యాంకు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్యాంకులో 1200 మంది రైతులకు గాను కేవలం 400 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి రామరాజుయాదవ్, పోతెపాక సాంబయ్య, బోగరి అనిల్‌కుమార్, రైతులు ముత్యాల శంకర్‌రెడ్డి, మేకల వెంకటేశం, నల్ల నర్సింహ, బుచ్చాల నాగరాజు, బొమ్మిడి శ్రీకాంత్, సింగిరిడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వెంకన్న, సుధాకర్‌రెడ్డి, నగేష్, రాజేందర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

యాదాద్రిలో ఆర్జిత సేవలు పునఃప్రారంభం



శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆర్జిత సేవలు శనివారం పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విశేష పర్వాలు జరిగిన నేపథ్యంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలను అధికారులు రద్దు చేశారు. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆలయ అధికారులు శనివారం ఉదయం పునఃప్రారంభించారు. ఈ పూజల్లో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఆలయంలో నిత్య కైంకర్యాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా అర్చకులు జరిపించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఒకరికి గాయాలు

మోత్కూరు: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం జరిగింది. రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన భిక్షమయ్య పని నిమిత్తం బైక్‌పై మోత్కూరుకు వస్తుండగా మోత్కూరు నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ మూలమలుపు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భిక్షమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

బాలికపై కుక్కల దాడి

ఆత్మకూర్ (ఎస్): వీధిలో ఆడుకుంటున్న బాలికపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. బొప్పారం గ్రామానికి చెందిన చెక్కల వీరభద్రం కుమార్తె మేఘన (11) మానసిక వికలాంగురాలు కావడంతో ఇంటి వద్దనే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం ఆడుకోవడానికి పక్క బజారుకు వెళ్లగా నాలుగు కుక్కలు ఒక్కసారిగా మేఘనపై దాడి చేశాయి. బాలిక అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన మేఘనను చికిత్స నిమిత్తం ఆమె తండ్రి వీరభద్రం, స్థానికులు కలిసి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గత ఐదు నెలలుగా గ్రామంలో ఆరుగురుపై కుక్కలు దాడి చేశాయని, కుక్కలను నివారించాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అగ్రి షో'లో ఆధునిక యంత్రాలు

నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ ఆవరణలో శనివారం నిర్వహించిన అగ్రి షోలో అనేక రకాల ఆధునిక యంత్ర పరికరాలను ప్రదర్శించారు. అగ్రి షోకు హాజరైన రైతులు ఆసక్తిగా తిలకించి, వాటి గురించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

– నల్లగొండ రూరల్



అగ్రి షోకు హాజరైన రైతులు, ఔత్సాహికులు

సీడ్ డ్రిల్..



పప్పు ధాన్యాల సాగుకు ఉపయోగించే సీడ్ డ్రిల్ ఎరువులతో కలిపి విత్తనాలు వేసే విధానం, వేర్వేరుగా మందులు, విత్తనాలు వేసే పద్ధతి సీడ్ డ్రిల్‌లో ఉంది. రైతుకు శ్రమ తక్కువగా ఉండి ఒకేసారి 11సార్లు (వరుసలు) విత్తనం వేయవచ్చు.

మాన్యువల్ వీడర్



చిన్న రైతులు సాగు చేస్తున్న పత్తి, మిర్చి ఇతర కూరగాయల పంటల్లో రైతులే స్వయంగా కలుపును నివారించడంతో పాటు భూసారాన్ని పెంచుకునేందుకు మాన్యువల్ వీడర్ ఉపయోగంగా ఉంది. దీని ధర 3,500.

డ్రోన్ స్ప్రే



పంటలకు రసాయన మందులు పిచికారీ చేసేందుకు ఉపయోగించే డ్రోన్ స్ప్రేలను రైతులు ఆసక్తిగా తిలకించారు. వీటి ధర రూ.2లక్షల నుంచి రూ.3.50లక్షల వరకు ఉంది. డ్రోన్‌ల ద్వారా రసాయన మందులు పిచికారీ చేస్తే నేరుగా మొక్కపైనే పడుతుంది. దీంతో రైతుకు ఆరోగ్యపరంగా రక్షణ లభించడంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుంది. పలు రకాల కంపెనీలు డ్రోన్‌లను షోలో ప్రదర్శించారు. 12 నుంచి 18 లీటర్ల వరకు సామర్థ్యం కలిగి ఉన్నాయి.

టైర్ చక్రాలు



గతంలో ఇనుప చక్రాలు, ఎడ్లబండి సాయంతో మందుల పిచికారీ చేసేవారు. పంటకు నష్టం జరగకుండా ట్రాక్టర్‌కు తక్కువ సైజ్‌లో ఉన్న టైర్ చక్రాలను బిగించి పత్తి, వేరుశనగ, వరి, పచ్చిమిర్చి తదితర వాణిజ్య, పప్పు ధాన్యాల పంటలకు మందుల పిచికారీ చేయడం సులభతరంగా ఉంటుంది. చక్రాల జత రూ.1.20లక్షలుగా ఉంది.

వరి నాటు యంత్రం

4, 6 వరుసలు ఉండే వరి నాటు యంత్రాలను ప్రదర్శనలో ఉంచారు. పెట్రోలుతో నడిచే యంత్ర పరికరం ప్రదర్శనలో ఉంచగా దీని ధర రూ.3.50లక్షల నుంచి రూ.4.20 లక్షల వరకు ఉంటుంది. 4 వరుసల యంత్రం రూ.3.50లక్షలు ఉండగా, 6 వరుసల యంత్రం రూ.4.20లక్షలుగా ఉంది. దీనికి ప్రభుత్వం రూ.50వేల సబ్సిడీ ఇస్తుంది.



భూమ్ స్ప్రే ట్యాంక్



భూమ్ స్ప్రే ట్యాంకర్‌తో వాణిజ్య పంటలకు, వరి పంటకు మందులు స్ప్రే చేయడం సులభంగా ఉంటుంది. 30 ఫీట్ల వరకు పంట సాగులో మందులు పిచికారీ చేయవచ్చు. భూమ్ స్ప్రేను తొలగించి బత్తాయి, నిమ్మ, ఇతర పంటలకు కూడా స్ప్రే చేసే విధానం ఉండటంతో రెండు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. దీని ధర రూ.1.05లక్షలుగా ఉంది.

తోటలకు స్ప్రే చేసేందుకు..



మామిడి, కొబ్బరి, పామాయిల్ తోటల్లో మందులు స్ప్రే చేసేందుకు ట్రాక్టర్‌ను పోలి ఉన్న యంత్రం ప్రదర్శనలో పెట్టారు. ఎత్తయిన మొక్కలకు సులభంగా మందు స్ప్రే చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. మిత్ర కంపెనీ తయారు చేసిన స్ప్రే యంత్రం 600 నుంచి 2వేల లీటర్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. దీని ధర రూ.4.50 లక్షలు ఉంటుంది.

సోలార్ సీసీ కెమెరాలు





ప్రదర్శనలో సోలార్‌తో నడిచే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ క్షేత్రాలు, నివాసంలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఫోన్‌కు కనెక్ట్ చేసుకుని పర్యవేక్షణ చేసే సౌకర్యం ఉంది. చుట్టూ తిరిగే కెమెరాతో పాటు ఒక వైపే చూసే కెమెరా కూడా ఉంది. దీని ధర 14,800గా ఉంది.

బయో ఫ్లాక్ పద్ధతిలో చేపల పెంపకం

బయో ఫ్లాక్ పద్ధతి ద్వారా చేపల పెంపకం సులభంగా చేయవచ్చు. భూమిలో చేపల చెరువులు ఏర్పాటు చేయడం ద్వారా నీరు ఎక్కువగా ఇంకుతుంది. బయో ఫ్లాక్ పద్ధతి ద్వారా తక్కువ ప్రదేశంలో ఉన్న కొద్ది నీటితో చేపల పెంపకం సులభంగా చేయవచ్చు.



ప్యాడీ బూట్లు



రైతుల కాళ్లకు రక్షణగా ఉండే ప్యాడీ బూట్లు ప్రదర్శనలో ఉంచారు. రైతులు ఏ సమయంలోనైనా వ్యవసాయ క్షేత్రంలో ఉన్నప్పుడు విషసర్పాలు, విద్యుదాఘాతానికి గురికాకుండా ప్యాడీ బూట్లు ఉపయోగంగా ఉంటాయి. వీటి ధర 1000.

'డిండి' పూర్తయితేనే ఫ్లోరోసిస్‌కు పరిష్కారం

- నిమ్స్ మాజీ డైరెక్టర్ రాజారెడ్డి



మర్రిగూడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో మాట్లాడుతున్న నిమ్స్ మాజీ డైరెక్టర్ రాజారెడ్డి

మర్రిగూడ: డిండి ఎత్తిపోతల, శివన్నగూడ ప్రాజెక్టు త్వరగా పూర్తయితే నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిమ్స్ మాజీ డైరెక్టర్ డి. రాజారెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను ఆయన సందర్శించారు. పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల దంతాలను పరిశీలించి ఫ్లోరోసిస్ ఏమైనా ఉందా అని పరిశీలించారు. అనంతరం శివన్నగూడ ప్రాజెక్టు పనులను పరిశీలించి ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కంచుకట్ల సుభాష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహేశ్వరం సతీష్, గొట్టిముక్కల ప్రకాశ్, ఉపాధ్యాయులు మాస బాలరాజు, కళా శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకటంపేట బాలయ్య, వెలిమినేటి సత్తిరెడ్డి, సురిగి యాదయ్య, వంగూరి సంజీవయ్య, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొర్రెల చోరీకి రెక్కీ.. ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ ధర్మా

చిట్యాల: గొర్రెలు దొంగతనం చేసేందుకు వచ్చి రెక్కీ నిర్వహిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరుగురు పరారయ్యారు. చిట్యాల ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో గొర్రెల మంద నుంచి గొర్రెలను దొంగిలించేందుకు ఎనిమిది మంది యువకులు వివిధ వాహనాల్లో వచ్చి రెక్కీ నిర్వహిస్తుండగా అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇద్దరిని పట్టుకున్నారు. మిగతావారు పారిపోయారు. పట్టుబడిన వారిలో కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన గౌరారపు వీరబాబు, త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన నీకంటి రాజశేఖర్ ఉన్నారు. వీరిని విచారించగా గత ఏడు నెలలుగా చిట్యాల, చౌటుప్పల్, భువనగిరి, హయత్‌నగర్, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి సమయాల్లో గొర్రెలు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం, టాటా ఇండికా కారు, మహేంద్ర గ్జైలో కారు, సీబీజెడ్ బైక్, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

- దొంగను పట్టుకున్న యువకులు

సూర్యాపేటటౌన్: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ చేసి పారిపోతున్న దొంగను స్థానిక యువకులు వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. సూర్యాపేటకు చెందిన చంద్రకళ పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు మీదుగా డీమార్ట్‌కు నడుచుకుంటూ వెళ్తోంది. ఆమెను వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై అనుసరిస్తూ వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయేందుకు యత్నించాడు. చంద్రకళ గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న యువకులు మరో బైక్‌పై దొంగను వెంబడించి కొంతదూరం వెళ్లాక పట్టుకున్నారు. దొంగకు దేహశుద్ధి చేసి యువకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దొంగను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దొంగతనం చేసిన వ్యక్తి ఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే దత్తత

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బండారు జయశ్రీ



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్మన్ జయశ్రీ

భువనగిరి: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి పిల్లలను దత్తత ఇవ్వనున్నట్లు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) చైర్మన్ బండారు జయశ్రీ తెలిపారు. శనివారం భువనగిరిలోని బాలరక్ష భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 8 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ఉన్నాయని ఇందులో ఉన్న పిల్లల్లో ఇప్పటి వరకు 14 మందిని దత్తత ఇచ్చినట్లు చెప్పారు. శిశు సంరక్షణ కేంద్రాల్లో వదిలేసిన పిల్లలు, తల్లిదండ్రులు అప్పగించబడిన, బంధువుల సంరక్షణకు నోచుకుని 16 మంది పిల్లలను గుర్తించి దత్తతకు సంబంధించిన ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లల దత్తత కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సెరా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని లేని పక్షంలో జిల్లాలోని బాలరక్ష భవన్‌లో సంప్రదించాలని కోరారు. బాలల సంరక్షణ కేంద్రాలలో దత్తతకు అర్హులైన పిల్లలకు తగిన కౌన్సిలింగ్ నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సహకరించాలని కోరారు. అక్రమ దత్తత విషయంలో గాని దత్తత చేసే విషయంలో నిర్లక్ష్యం జరుగుతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సభ్యులు మల్లేశం, ఇస్తారి, రుద్రమాదేవి, బాలల సంరక్షణ అధికారి సైదులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల శివారు 65వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలంలోని మండలాపురం గ్రామానికి చెందిన తీగల దిలీప్(22) ఇనుపాముల శివారులో పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దిలీప్‌కు తీవ్రగాయాలు కావడంతో నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

సూర్యాపేట టౌన్ :ఆర్థిక ఇబ్బందులతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్-1కు చెందిన వసీం అత్తర్‌ఖాన్(43) జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అవడంతో మద్యానికి బానిస అయ్యాడు. భార్య ఫజి యా బేగం కూడా జనరల్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తోంది. శనివారం భార్య ఉద్యోగానికి, పిల్లలు స్కూల్‌కు వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేకపోవడంతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చే సరికి మృతిచెంది ఉన్నాడు. భార్య ఫజియా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

డియర్ రజిని.. నన్ను క్షమించు

వసీం అత్తర్‌ఖాన్ ఆత్మహత్య చేసుకునే ముందు సూసైడ్ నోట్ రాశాడు. డియర్ రజిని (ఫజియా బేగం) నన్ను క్షమించు.. నిన్ను చాలా బాధ పెట్టాను. పిల్లలు జాగ్రత్త.. మనకు ఎవరూ లేరు.. మనిద్దరి జీవితంలో నేను చాలా ఊహలు కన్నాను. కానీ ఏదీ కుదరలేదు. వచ్చే జన్మ ఉంటే మాత్రం నా పిల్లలలో ఎవరికైనా కొడుకుగా పుడతా. అలాగే కొంతమందికి డబ్బులు ఇవ్వాలి. కింద వాళ్ల పేర్లు రాస్తున్న.. ఇవ్వకపోతే వాళ్లు తిట్టుకుంటారు.. అని లేఖలో రాశాడు. కాగా, ఫజియాబేగం అసలు పేరు రజిని. రజిని, వసీం మతాంతర వివాహం చేసుకున్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



గత ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యం బాటిళ్లను శనివారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. అదే విధంగా 2018–20 సంవత్సరాలలో పట్టుబడిన మద్యాన్ని కూడా ధ్వంసం చేశారు.

– సూర్యాపేట రూరల్


యువకుడి అదృశ్యం



అనిల్‌కుమార్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లగిరి గ్రామానికి చెందిన పోలేపల్లి అనిల్‌కుమార్(25) ఎంబీఏ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువకుడి తండ్రి యాదయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవరెడ్డి తెలిపారు.


రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయం నుంచి రెండు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటి మట్టం గరిష్టస్థాయిలో 590 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి సాగర్ జలాశయానికి 69,884 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా 22400 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్ ఉత్పాదన కేంద్రం ద్వారా 29191 క్యూసెక్కులు మొత్తం 51591 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి కాల్వ ద్వారా 8375 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7518 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతలలో 2 గేట్ల నుంచి..



పులిచింతల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు శనివారం 45,684 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో రెండు క్రస్ట్ గేట్లను 2.5 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 41,684 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల కూసెక్కులను దిగువన ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 44.69 టీఎంసీల నీరు ఉంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 53.13 మీటర్ల వరకు నీరు ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 174.30 అడుగుల వరకు నీరు ఉంది.

105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో శనివారం 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఎస్‌ఈ దేశ్యానాయక్ తెలిపారు.